# సాహిత్యహింసావలోకనం

హనుమంతరావుకు ఏదో అకాడమీ బహుమతి వచ్చిందన్న పిడుగులాంటి వార్తవిని జయ ఢంకా విచ్ఛేదక సంఘం వారు అత్యవసర సమావేశం జరిపారు. ఈ వార్త పట్ల సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి ఏదో ఉపద్రవం వాటిల్లబోతున్నదనీ, దాన్ని నివారించడానికి వ్రజాయుధం లాంటి ఉద్యమం నడపాలనీ తీర్మానం చేశారు.

తీర్మానం పూర్తి పాఠం ఇది:

"నడి వీధుల్లో. హోటళ్ళలో. పార్కుల్లో, క్లబ్బుల్లో పదిమందిని చుట్టూ పోగేసుకొని వాడెంత వీడెంత అని అంతస్తు, అర్హత తెలుసుకోకుండా ధీమాగా విమర్శించే వాళ్ళూ, రచన అనే పేరుతో అడ్డమైన చెత్తా చెదారం ఉత్పత్తిచేస్తూ అహంకారముతో, దర్పంతో రొమ్ము విరుచుకు తిరిగేవాళ్ళూ, ఆంగ్లభాషను దేశభాషగా ఎంచి, వరించి, ఆ ఎంగిలిని తెలుగు సాహిత్యానికిపట్టించేవాళ్ళూ, కలెక్టర్లను, మంత్రులనూ కాకా పట్టేవాళ్లూ, సొంతడబ్బు కొట్టుకుని సన్మానాలు చేయించుకునే వాళ్ళూ ఈనాడు మన సమాజంలో కుక్క గొడుగులవలె లెక్కకు మిక్కిలిగా పుట్టుకొస్తున్నారు. కీర్తికోసం, ధనంకోసం వారు అతినీచానికి పాల్పడుతున్నారు. వారి దొంగరచనలతో, పచ్చిబూతు రచనలతో సాహిత్యం దుర్గంధ భూయిష్ఠమవుతున్నది. సాహితీలతకు పట్టిన చీడపురుగులు వాళ్ళు. వాళ్ళపై ఫ్లిట్ జల్లాలి. వాళ్ళ రచనలవల్ల సాహిత్యం సెప్టిక్ అవుతున్నది. దీనికి యాంటీ సెప్టిక్ ఉద్యమం అవసరం.

"సమాజానికి ఇటువంటి రచయితలు చేయగల కీడు ఇంకెవ్వరూ చేయలేరు. వీరు జాతి సంస్కృతినే హత్యచేయగలరు. సాహిత్యంలో జాతీయతను రూపుమాపి, విరుద్ధమైన జాతీయ భావాలను ప్రవేశ పెడుతున్నారు. జాతి వ్యక్తిత్వాన్ని ఖూనీ చేస్తున్నారు. ప్రజల మనస్సుల్లో అవ్యవస్థను, అయోమయాన్ని సృష్టిస్తున్నారు. వికృత భావాలకు విషబీజాలు నాటుతున్నారు. సమాజానికి వీళ్ళు చేసే కీడు వీరి తరంతోనే అంతంకాదు. వంశపారంపర్యంగా ముందు తరాలకు సంక్రమిస్తుంది. ఈ సాంకర్యానికి, ఈ కుక్క గొడుగుతనానికి ముందు తరాల వారు వారసు అవుతారు. ఒక జాతి చరిత్రకు, సంస్కృతికి ముఖ్యాధారం సాహిత్యమే.

"ఈ రచయితలు ఇంత ప్రమాదకారులై వుండి కూడా సమాజంలో అందరికంటే పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్నారు. 'వ్యభిచారం చేసేవాళ్ళనీ, దొంగతనంచేసేవాళ్ళనీ, తాగుబోతులనీ, హంతకులనీ మనం. మన ప్రభుత్వం దూషిస్తాం, వెలివేస్తాం, శిక్షిస్తాం. కాని దొంగ రచయితలను మాత్రం ఏమీ అనం. అతను బైటపడడు.

"ఈ పరిస్థితి ఇకమీదట కొనసాగకూడదు. దొంగరచయితను జుట్టుపట్టుకుని వేదికమీదికి లాక్కువచ్చి బండారం బైటపెట్టాలి. అందరికీ రాళ్ళూ, జోళ్ళూ, కుళ్ళిపోయిన కోడిగుడ్లూ పంచిపెట్టి అతని ముఖంమీద వేయించాలి. రచయిత గుట్టుమట్లు రచయితకే తెలుస్తాయి. అందుకే నిజాయితీగల రచయితలందరూ చేరి దొంగరచయితల వేటకు ఉద్యమం ప్రారంభించాలి.

"రాజకీయ నాయకులనూ, న్యాయవాదులనూ

# సువర్ణలాంగూల ప్రదానం

నండూరి పార్థసారథి

కూడా ఏమార్చగల దారుణమైన బుద్ధి దొంగ రచయితది. అతను భీమా ఏజెంటును కూడా కాకాపట్టగలడు. అందుచేత అతని శక్తి యుక్తులను మనం ఏ మాత్రం తక్కువగా చూడకూడదు. మారువేషం వేసుకుని అతనే మన ఉద్యమంలో చేరే ప్రమాదం వున్నది. భారత సైన్యంలో చైనావాడు చేరితే ఎంత ప్రమాదమో దొంగ రచయిత మన ఉద్యమంలో చేరడం అంత ప్రమాదం. అందుచేత ఈ ఉద్యమంలోనికి రచయితలను రిక్రూట్ చేసుకునే పద్ధతి చాలా క్లిష్టంగా వుండాలి. వాడు మన మేనమామ, వీడు మన బావమరిది అనే మొహమాటాలు వుండకూడదు.

"ఈ ఉద్యమం పేరిట వ్యంగ్య రచనలు, ప్రహసనాలు, వ్యాసాలు కొల్లలుగా వెలువడాలి. ఏ ఏ రచయితలు ఏ ఏ రచనలను కాపీ చేశారో దృష్టాంతాలతో సహా పేర్కొంటూ ఎప్పటి కప్పుడు సమీక్షలు వ్రాయాలి. సభలు, సమావేశాలు జరిగి గ్రంథచౌర్య వ్యతిరేక ప్రచారం చేయాలి. ఒక నిర్దిష్ట కార్యక్రమం ప్రకారం ఉద్యమం నడపాలి. దీని ప్రచారంకోసం కొన్ని పత్రికలు కూడా నెలకొల్పడం అవసరం. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ ఉద్యమానికి సంఘాలు అప్పుడప్పుడు కరపత్రాలు ప్రచురిస్తూ వుండాలి. ఈ సంఘాల కృషికి సమన్వయం అవసరం.

"ఎవడు ఏ ఉద్యమం ప్రారంభించినా ఆదిలోనే అపశకునాలు పలకడానికి, నిరుత్సాహ పరచడానికి సమాజంలో ప్రత్యేకంగా ఛాందసుల వర్గం ఒకటి ఎప్పుడూ వుంటుంది. ఉద్యమం ఎప్పుడు విఫలమవుతుందా, ఎప్పుడు వెక్కిరిద్దామా అని వారు ఎదురు చూస్తూ వుంటారు. "చూశావా నేను మొదట చెప్పాను. లాభంలేదయ్యా అని" అని ఎద్దేవ చెయ్యడానికి వాళ్లు కాసుక్కూచ్చుంటారు. వాళ్ళకు ఒక్కటే సమాధానం—ఈ ఉద్యమానికి జయాపజయాల ప్రసక్తిలేదు. ప్రయత్నం చేయడమే మనవంతు ఎంత ఫలితం దక్కినా దక్కినట్టే పనిచేశామన్న సంతృప్తితో మనకు ఛాందసవర్గం కోరుకున్నట్టు ఈ ఉద్యమం సగంలోనే ఆగిపోయినా వచ్చిన నష్టమేమీ లేదు. కర్మాగారాన్నిగానీ, చలన చిత్రాన్నిగానీ సగం నిర్మించి ఆపుచేస్తే మొత్తం పెట్టుబడి అంతా నష్టమే అవుతుంది. కాని ఇది ఇట్లాకాదు, ఇది పెట్టుబడిలేని వ్యాపారం. పారుబోయు. టాక్సులేదు.


"ప్రపంచంలో సర్వత్రా చెడు అనేది ఎప్పుడూ వుంటూనే వుంటుంది. హెచ్చుతగ్గులు సృష్టి సహజమైనవి. ఎన్ని ఉద్యమాలు సాగించీ చెడును లేకుండా చేయలేము" అని వాదించే వాళ్లూ వుంటారు. ప్రపంచంలో చెడు పూర్తిగా ఎప్పుడూ అంతరించదన్నమాట నిజమేకానీ దాన్ని మరీ ఎక్కువగా విజృంభించనీకుండా చేయడం అవసరం, చెడుకు ఒక గరిష్ఠ స్థాయి వుంది. అది ఆ స్థాయిని మించకూడదు. ధర్మదేవత నాలుగు కాళ్ళమీద కాకపోయినా కనీసం ఒంటికాలిమీదనైనా నిలబడాలి. మంచికి, చెడుకు మధ్య తారతమ్యం చెడే పరిస్థితులు వచ్చినపుడే భగవంతుడు అవతారాలు ఎత్తాడు. మహా

పురుషులు ఉద్యమాలు నడిపారు. ఈ ఉద్యమాలు లేకపోతే ధర్మదేవత నాలుగోకాలు కూడా ఏనాడో విరిగిపోయి వుండేది.

"అందరూ గొప్ప రచయితలే కావాలనీ, కాని వారిని బూతులు తిట్టాలనీ మనం వాదించము. అందరూ గొప్పగా రాయలేక పోవచ్చు. కానీ మంచో చెడో కాపీకొట్టకుండా స్వయంగా రాయాలి. పత్రికలో పేరు చూసుకుందామనే మోజుతోనూ, డబ్బు సంపాయించుకుందామనే ఆశతోనూ కాక నిజంగా ఉత్తేజితులైనప్పుడే రాయాలి. ఫలితం ఎలావున్నా ప్రయత్నంలో చిత్తశుద్ధి వుండాలి. అదీ మనం కోరేది. చిత్తశుద్ధితో చేసిన రచనలు బాగా లేకపోతే బాగా లేవనిఅంటాము కానీరచయితను దూషించము. రచయితల కీర్తిదురదనీ, ధనదాహాన్నీ, గ్రంధ చౌర్యాన్నీ ఖండించడమే ఈ ఉద్యమ లక్ష్యం. సాహితీ లోకకళ్యాణమే మన ఆశయం."

ఈ తీర్మానాన్ని సంఘం ఏకగ్రీవంగా ఆమోదించింది. గ్రంధచోరులకు, రచనా వ్యాపారులకు ప్రతినిధి అయిన హనుమంతరావును అవమానించడంతో ఈ ఉద్యమానికి ప్రారంభోత్సవం చేయాలని నిర్ణయించారు.

కోరినంతనే ఆ హ్వానాన్ని అంగీకరించి హనుమంతరావు సన్మానానికి విచ్చేశాడు. ఊరి



మధ్య విశాలమైదానంలో సభ ఏర్పాటు చేశారు. రచయితలు, సాహితీప్రియులు, పల్లిషర్లు, సామాన్య ప్రజలు విశేష సంఖ్యలో హాజరైనారు. ఉపన్యాసకులందరూ జయఢంకా విదేదక సంఘ సభ్యులే. హనుమంతరావు ప్రముఖరచనా వ్యాపారి అనీ, కథా వస్తు సంగ్రహణంలో ఆయనను మించినవారు లేరనీ, వ్యాపార వర్గానికి అంతటికీ ప్రతినిధిగా అతన్ని సన్మానిస్తున్నామనీ అధ్యక్షుడు చెప్పారు. తర్వాత సంఘం తరపున అతనికి సన్మానపత్రం సమర్పించారు.

అతని వ్యాపార దక్షతను, కవితాశక్తిని గుర్తించి "వ్యాపారపార్టీ" "కవిఖర" బిరుదులను ప్రదానం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. హనుమంతరావు అది చదివి "కవిశేఖర" అనడానికి బదులు "కవిఖర" అని అచ్చుపొరపాటు దొరలినందుకు విచారం ప్రకటించాడు. వెంటనే అధ్యక్షుడు లేచి అది అచ్చు తప్పు కాదనీ, "కవికోకిల" అన్నట్లుగనే "కవిఖర" అనడంలో తప్పులేదనీ, పోనీ అర్థం కాదనుకుంటే "కవిగార్ధభ" అని దిద్దుకోవచ్చుననీ వివరించాడు. తర్వాత హనుమంతరావు మట్లాడుతూ తనకు చేసిన గౌరవానికి కృతజ్ఞత తెలియజేశాడు. "కవిఖర" అనే బిరుదు నిచ్చి ఈ సంఘంవారు నన్ను మహోన్నతుణ్ణి చేశారు. బహుశః ఇంత గౌరవం ఇటీవలి కాలంలో ఏ రచయితకు దక్కలేదనుకుంటాను. అర్థంచేసుకోలేని పామరులకు ఈ బిరుదు వికృతంగా కనిపించవచ్చును. కాని ఈ సంఘంవారు ఇందులో ఎంతో గొప్ప అర్థం ఇమిడ్చారు. వినయంలో, విస్వాసంలో గాడిదను మించిన జంతువులేదు. నన్ను దానితో పోల్చారంటే నేను బుధజన విధేయుకినని వారి తాత్పర్యం. మనిషికి గాడిదచేసే చాకిరీ ఇంకే జంతువూ చేయదు. సాహిత్యానికి నేనూ అంత సేవ చేస్తున్నానని వారిభావం. బరువులు మోయడంలో గాడిదకు ఎంత ఓపిక వుందో, సాహిత్యోద్ధరణ బాధ్యతా భారాన్ని వహించడంలో నాకు అంత శ్రద్ధ వుంటుంది

వీరి ప్రశంస. నన్ను గార్దభంతో పోల్చడంతో వారు ఒక విధంగా గార్దభ జాతినే గౌరవిస్తున్నారనికూడా చెప్పుకోవచ్చు" అని కూస్తున్నాడు. ఈ మాటలన్నీ విన్న గాడిద ఒకటి, హనుమంతరావు వంటి పీచుడిని తనతో పోల్చినందుకు నిరసనగా పెద్ద పెట్టున ఓండ్ర పెడుతూ నేరుగా సభావేదిక మీదకు వచ్చింది. సమావేశ కర్తలు నెమ్మదిగా దాన్ని అనునయించి, పొరపాటు జరిగిపోయిందని క్షమాపణ చెప్పుకొని పూలమాల ఒకటి మెడలో వేసి పంపించారు.



తర్వాత చంద్రుడికో నూలుపోగు అన్నట్టు హనుమంతుడికో బంగారు తోకను సమర్పించి ఖద్దరు శాలువ కప్పారు. సాంఘిక నాటకాలలోనే కాక, పౌరాణిక నాటకాలలోకూడా - ముఖ్యంగా ఆంజనేయులవారి వేషం వేయవలసిందిగా తనను అభ్యర్థిస్తూ ఈ సంఘం వారు తనకు ఈ సువర్ణలాంగూలమును బహూకరించారనీ, దీనిని ప్రజలు వేరు విధంగా భావించరాదనీ హనుమంతరావు వివరించాడు. వారి అభ్యర్థనను తాను మన్నిస్తున్నట్టుకూడా చెప్పాడు. ఆ ధ్వనులమధ్యనుంచి "కవిగాడిదా" అన్న ప్రస్తుతులు వినవచ్చాయి. తర్వాత మచ్చుకి ఒక రాయి కూడా పడింది. దానిని రక్షణనిధికి వేలం వేద్దామనుకున్నాడు. కాని, కొనుక్కున్నవాడే మళ్ళీ విసురుతాడేమోనని మానేశాడు.

చివరికి ఒకాయన వందన సమర్పణంచేస్తూ, రచయితకు చిత్తశుద్ధి ముఖ్యమని, అదిలేకపోతే దేహశుద్ధి అవసరమవుతుందనీ ఉద్ఘాటించారు. జ. ధం. వి. సం. వారు తమ తీర్మానాన్ని కరపత్రాలుగా ప్రచురించి సభలో పంచిపెట్టారు.


హనుమంతుడు తోక బుజాన వేసుకుని ఇంటికి వచ్చాడు. తీరా చూస్తే అది బంగారు రంగు వార్నీసుపూతఅని తేలిపోయింది. ఖద్దరు శాలువ ఖరీదు 10 రూపాయలుంటుందని అంచనా వేశాడు. జరిగిన అవమానాన్నీ, ఈ పదిరూపాయలనీ త్రాసులో పెట్టి తూకం వేశాడు. తనకు అట్టే నష్టం లేదని తృప్తిపడ్డాడు.

ఇక తను ఉపేక్షించి వూరుకుంటే ఈ ఉద్యమం కార్చిచ్చులాగా వ్యాపించిపోతుందనీ, రచనా వ్యాపారం సర్వనాశన మవుతుందనీ భయపడ్డాడు హనుమంతరావు. వెంటనే ప్రతిఘటనోద్యమం ప్రారంభించా లనుకున్నాడు. ఉద్యమానికి హంగులు పూర్తిచేసుకునేలోగా ముందు గ్రంథచౌర్యాన్ని సమర్థిస్తూ ఒక వ్యాసం రాసి "జయఢంకా"లో ప్రచురించాడు. దానికి హనుమంత్రైట్ ఫిలాసఫీ అని పేరు పెట్టాడు. దాని సారాంశం ఇది:

"ప్రపంచంలో ప్రతిరచయితకూ కాపీరైట్ వుంది. (కాపీరైట్ అనగా కాపీ చేసుకునే హక్కు). అది రచయిత జన్మహక్కు. ఈ హక్కును త్రోసిరాజనే హక్కు ఎవరికీ లేదు. కాపీకీ అనుకరణకూ తరతమ భేదమే తప్ప ఏమీ లేదు. అక్షరాక్షరం అనుకరణచేస్తే కాపీ అంటారు. మధ్యలో సొంతకవిత్వం పెడితే అనుకరణ అంటాము. అనుకరణసృష్టి సహజమైనది. అనుకరణ లేనిదే ప్రపంచం లేదు. సంప్రదాయాలూ, ఆచారాలూ, ధర్మాలూ—ఇవన్నీ అనుకరణ ఫలితాలే. ఒకరు చెప్పిన మంచిని కొన్నాళ్ళు వరసగా అనుకరిస్తూ వస్తే అదే సంప్రదాయమవుతుంది. ధర్మమవుతుంది. అలవాట్లుకూడా అనుకరణలే. భాష అంటే కొన్ని శబ్దాల అనుకరణ. తెలుగు భాష పుట్టినప్పటినుంచి ఒకరు వాడిన పదాలనే మరొకరు వాడుతూ వచ్చారు. భావాలు కూడా అంతే. చిన్నపిల్లలు పెద్దవాళ్ళని అనుకరిస్తారు.

అలా అనుకరిస్తూనే పెద్దవాళ్ళయిపోతారు. అనుకరించకపోతే వికాసం లేదు.

"ఇహ రచన విషయానికొస్తే - ఈనాడు ఎవ్వరూ అక్షరాక్షర అనుకరణ (కాపీ) చేయడం లేదు. అనుకరిస్తున్నారు అంతే. అంటే వీళ్ళ సొంతం కూడా కొద్దిగా వుంటోంది. అనగా మొదటిదాని పరిణామ ఫలితం అన్నమాట రెండోది. సకల సృష్టీ పరిణామ ఫలితమేనని డార్విన్ మహాశయుడు వక్కాణించియున్నారు. అసలు ఈ ప్రపంచకమే స్వయంభువు కాదు. మన భారతీయ సాహిత్యమంతటికీ మూలం వేదాలు. అందులోంచి ఉపనిషత్తులు, వాటిల్లోంచి భగవద్గీత, భాగవతం, రామాయణం, భారతం ఇలా పుట్టుకొచ్చాయి. కాబట్టి సాహిత్యంకూడా పరిణామఫలితమేనని స్పష్టమవుతోంది. ఇక గ్రంథ చౌర్యాన్ని విమర్శించడం ఎందుకో



నాకు అర్థం కాదు. పరిణామ లక్షణాన్ని నిరోధిస్తే సృష్టిక్రియ స్తంభించిపోతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అసలు బ్రహ్మగారు తప్ప ఇంతవరకూ ఒరిజినల్‌గా రాసినవా డెవడూ లేడు."

హనుమంతరావు దీనిని కరపత్రాలుగా పంచిపెట్టాడు. ఇ. ధం. వి సం వారు తమ ఉద్యమం కోసం ఒక పత్రికను నెలకొల్పారు. వ్యంగ్య రచనలు వ్యాసాలు ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. హనుమంతరావును ధూర్త నాయకుణ్ణిగా చేసి, రచనా వ్యాపారులను నిందిస్తూ నాటకాలు రచించి ప్రదర్శిస్తున్నారు.

ఇదంతా గమనించి హనుమంతరావు ఇక తన ఉద్యమాన్ని శత్రుదుర్నిరీక్ష్యమానంగా భారీఎత్తున సాగించాలనీ తన కృషినంతటినీ ఏకోన్ముఖం చేయాలనీ కంకణం కట్టుకున్నాడు. దీనికి ఒక పెద్ద కార్యక్రమం తయారు చేసుకున్నాడు. తర్వాత స్థానిక హనుమంతరావు లందరినీ సమావేశపరచి పరిస్థితిని వివరించాడు. తక్షణమే కట్టుదిట్టమైన చర్యలు తీసుకొనకపోతే పరిస్థితి విషమిస్తుందని హెచ్చరించాడు. ఈ సందర్భంలో అతడు ఇంకా ఇలా ప్రసంగించాడు: "మన శత్రువులు మన గుట్టురట్టు చేస్తున్నారు. మనకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారు. ప్రజలు తిరగబడితే ఇక మనం చేయగలిగే దేమీ ఉండదు. అంతదాకా రాకుండా మనం జాగ్రత్తపడాలి. ప్రజల సానుభూతి వున్నంతకాలం మనకేమీ ఫరవాలేదు. ఇప్పుడు మనం చేయవలసినదంతా ప్రజల సానుభూతిని చూరగొనడమే. వాళ్ళు మన గొప్పను గుర్తించాలి. నా గొప్పను గురించి నా పత్రికలో రాసుకుంటే ఇవాళ కాకపోతే రేపైనా అది సొంతడబ్బా అని పసిగట్టేస్తారు. సానుభూతికాస్తా తుడిచిపెట్టుకుపోతుంది. కాబట్టి నన్ను ఇంకొకరు పొగడాలి. నేను ఇంకొకరిని పొగడకపోతే ఆ ఇంకొకరు నన్నెందుకు పొగుడుతారు. ఇదే సహకారోద్యమానికి ప్రాతిపదిక. ప్రతిరచయితకీ డబ్బా అవసరమే కనుక పరస్పర ప్రయోజనార్థం సహకార

విధానాన్ని అవలంబించాలి. అందుచేత ఇప్పుడు మనం అందరం కలిసి ఒక సంఘంగా ఏర్పడాలి. దీని పేరు పరస్పర ప్రశంసా మండలి. దీని వ్యవస్థాపకుణ్ణి నేను కనుక, అధ్యక్షుణ్ణికూడా నేనే అయివుండటం సముచితంగా వుంటుంది మనం అందరం కలిసి తలాకొంచెం పెట్టుబడిపెట్టి నాలుగు పత్రికలు నెలకొల్పాలి, నాలుగింటికి నలుగురు ఎడిటర్లు వుంటారు. ఈ నాలుగు పత్రికలూ అస్తమానం ఒకదాన్ని ఒకటి పొగుడుకుంటూ వుంటాయి, అన్నీకలసి ఉమ్మడిగా మన వ్యాపారులందరినీ పొగుడుతూవుంటాయి. అప్పుడు ఎవ్వరూ సొంతడబ్బాఅని ఆక్షేపించడానికి వీలుండదు. పైగా అసలు మనం మనం అంతా ఒకటేనన్న రహస్యంకూడా ఎవరికీ తెలీదు. ఈ పత్రికలు మన శత్రువుల ఉద్యమాన్ని ఖండిస్తూ ఒక్కుమ్మడిగా రచనలు గుప్పించాలి. రచనా వ్యాపారాభివృద్ధికి ప్రచారంచెయ్యాలి."

హనుమంతరావు ఉపన్యాసం చాలించి కూచోగానే వణిక్కుమారులందరూ కరతాళ ధ్వనులు చేశారు. పరస్పర ప్రశంసామండలి అధ్యక్షుడుగా హనుమంతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థాపించబోయే నాలుగు పత్రికలకూ సంపాదకులనుకూడా అప్పుడే ఎన్నుకున్నారు.

తర్వాత నెలరోజుల్లోగా నాలుగు పత్రికలూ విపణివీధిలోకి వచ్చాయి. జ.ధం.వి.సం. వారు ఈ పరిస్థితి చూసి చాలా కలవరపడ్డారు. కొన్నాళ్ళు జాగ్రత్తగా ఈ పత్రికల ధోరణిని గమనించి, పరస్పర డబ్బాయే వాటి పాలసీ అని పసికట్టేశారు. ఈ రహస్యాన్ని బట్టబయలుచేస్తూ కరపత్రాలు అచ్చువేశారు.


## చందాదారులకు సదవకాశం

జయశ్రీ సచిత్ర మాసపత్రిక అతిస్వల్పకాలంలోనే వేలాది పాఠకులను ఆకర్షించి అభిమానాన్ని చూరగొన్నది.

జయశ్రీ సచిత్ర మాసపత్రికకు మీరు చందాదారులుగా చేరారా...చేరితే సరే...చేరకపోతే వెంటనే చందాదారులుగా చేరండి. మీకో సదవకాశాన్నికూడా కల్పిస్తున్నాం. మేనెల ఆఖరులోగా సంవత్సర చందా క్రింద రూ. 7/= కట్టితేచాలు, ఆపైన చేరితే రూ. 9/=లు కట్టవలసి వస్తుంది. జూన్ నెల నుండి పత్రిక వెల 0-75 పై. చేస్తున్నాం. జయశ్రీ సచిత్ర మాసపత్రికను ఇక ముందుకూడా ఇప్పుడున్న ముప్పాళ్ళ రంగనాయకమ్మ, రాచకొండ విశ్వనాధశాస్త్రిగార్ల సీరియల్సుతో పాటు, సరికొత్త పోకడలతో సరికొత్త రుచులతో, అత్యంతాకర్షణలతో, జోక్సుతో, సినిమా వ్యాసాలతో, కొత్తకొత్త శీర్షికలతో సర్వాంగ శోభితంగా తయారుచేయాలని కృషిచేస్తున్నాం...

ఇంకా వివరాలు కావాలంటే ఈ క్రింది చిరునామాకు వ్రాయండి.

మేనేజరు,
జయశ్రీ,
సచిత్ర మాసపత్రిక,
విజయవాడ-2.

## రచయితలకు మనవి

జయశ్రీ పత్రికకు రచనలు పంపగోరువారు ఈక్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాం.

1. రచనలు కాగితానికి ఒకవైపునే సీరాతో రాసిపంపాలి.

2. కార్టూన్లు, రేఖాచిత్రాలు ఇండియన్ ఇంక్‌తో గీసినవి పంపాలి.

3. తమ రచనలను, కార్టూన్లు త్రిప్పి పంపగోరువారు తగినంత పోస్టేజి జతపరచి పంపాలి. పోస్టేజి లేని రచనలు త్రిప్పి పంపడంగాని, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడానికి గాని అవకాశంలేదు.

"జయఢంకా", దాని సోదర పత్రికలూ ప్రతివారం పెద్దపెద్ద అక్షరాలతో "రచనా వ్యాపారంలో మనువు పెట్టండి" అని ప్రకటనలు చేస్తున్నాయి. జయఢంకా సంపాదకులు గాయత్రీదేవి "గాయత్రీ మంత్రం" అనే శీర్షికనుపెట్టి ఆడవాళ్ళకు వారానికో వ్యాపార రహస్యాన్ని ఉపదేశిస్తోంది. తిరగమూత పెట్టడంకంటే వ్యాసం రాయడం కష్టంకాదని వాటి తాత్పర్యం. "వ్యాపారంలో భర్తలకు తోడుపడండి", "తీరిక వేళలను రచనకు వినియోగించండి", "రచించు ఆర్జించు" అని సలహాలిస్తోంది.

ఈ సలహాలు జనాన్ని ఆకర్షించాయి. మధ్యతరగతి మొగుళ్ళు, తండ్రులు ఇంట్లో ఆడవాళ్ళను సాధించడం మొదలుపెట్టారు. "పగలస్తమానం ఇంట్లో వూరికే గోళ్ళు గిల్లుకుంటూ కూచోకపోతే ఏవైనా నవలలు రాయరాదూ. ఏదో వేన్నీళ్ళకి చన్నీళ్ళన్నట్టు సంపాదన కలిసొస్తుందిగా ఒక్క మగవాడి సంపాదనమీదనే ఆధారపడాలను కుంటే మనలాంటి పేదకుటుంబాలకిగడుస్తుందా? అయినా ఇదేం బ్రహ్మవిద్యా? ఒళ్లు విరుచుకోవాల్సిన బరువుపనా? ఋబ్బరంగా గడప దాటాల్సిన పని లేకుండా వరువుగా ఇంటో కూచుని చేసేపనేగా. అక్షరమ్ముక్క చదువుకోకపోయినా ఆ గాయత్రీదేవి ఎలా రాస్తోందో చూడు. ఆవిణ్ణి చూసి సిగ్గుతెచ్చుకో" అని మందలిస్తున్నారు.

ఈ ఉద్బోధలతో ఉత్తేజితులై ఆడవాళ్ళందరూ కలాలు పట్టుకుని రంగంలోకి దూకారు.

జ. ఢం. వి. సం వారికి వైరాగ్యం పుట్టుకొస్తోంది. అయినా వుండి వుండి ఒకసారి లేచి "అంతిమ విజయం మాదే" అని అరుస్తున్నారు. వీళ్ళని చూసి వ్యాపారులు పగలబడి నవ్వుకుంటున్నారు. హనుమంతరావుకు ఇక ధైర్యం వచ్చింది. అయినా ఎటుపోయి ఎటు వస్తుందో. ముందు తన సొంత వర్గాన్ని ఇంకా పటిష్ఠం చేసుకోవడం మంచిదనుకున్నాడు. పెట్టుబడి పెట్టిన కొద్దీ ఖర్చు కలిసొస్తుంది. అందుకని పుస్తకాల ప్రచురణకూడా ప్రారంభించాడు. తన పుస్తకాలు, పెళ్ళాం పుస్తకాలు, కొడుకు పుస్తకాలు మాత్రమేకాక ఇతరుల పుస్తకాలు - ముఖ్యంగా కొత్తగా రంగంలోనికి ప్రవేశించిన వారి పుస్తకాలుకూడా ప్రచురిస్తున్నాడు. వంద పేజీలకు 50 రూపాయల చొప్పున, చౌకగా బేరమాడి, ప్రస్తుతానికి పది ఇచ్చి, తర్వాత అప్పుడో రూపాయి, అప్పుడో అర్ధ చొప్పున ఇంకో పదిహేను జమకట్టి మిగతా పాతిక సలక్షణంగా ఎగకొట్టడం ఈ కొత్తరకం పాలసీ. ఎప్పుడైనా చెదురు మదురుగా వాళ్ళకి ఇప్పించిన కాఫీలను కూడా ఇందులో జమకడతాడు. అతని చుట్టూ తిరగడానికి అయిన బస్సు ఖర్చులు, రిక్షా ఖర్చులు అరిగిపోయిన చెప్పుల ఖర్చుకూడా లెక్కవేసుకుంటే ఏ రచయిత మళ్ళీ రెండోసారి అతనికి పుస్తకం ఇవ్వడు. ఇస్తారని హనుమంతరావు ఆశించడమూ లేదు. కొత్తవాళ్ళే కొల్లలుగా వున్నారు. ప్రచురణాలయంలో ఏదైనా దేవుడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే ప్రదక్షిణలు చేసినందుకు డబ్బుకాకపోయినా పుణ్యమయినా దక్కుతుందని



రచయితలందరూ అతనికి మెమోరాండం సమర్పించారు. నిక్షేపంగా ప్రత్యక్షదైవాన్ని నేనుండగా ఇంకా విగ్రహాందేనికి డబ్బు ఖర్చు" అని చెప్పాడు హనుమంతరావు.

జ. ధం. వి. సం వారిని రెచ్చగొట్టేపని ఇంకొకటి కూడా చేశాడు అతను. స్థానిక గ్రంధాలయాలన్నింటినీ గాలించి, జానపద సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలన్నీ తీసుకొచ్చి ప్రెస్సులో కంపోజ్ కిచ్చాడు. లోగడ తాను జానపద సాహిత్యంమీద రాసిన వ్యాసాలను రెండింటిని ముందు తగిలించాడు. అంతా వెయ్యి పేజీల ఉద్గ్రంథం అయింది. దానికి "ఆంధ్ర జానపద వాఙ్మయ సర్వస్వం" అని పేరు పెట్టాడు. సంపాదకుడు: హనుమంతరావు, సహాయకురాలు: గాయత్రీదేవి, ముఖచిత్రం: చిరంజీవి ఆశాకిరణ్, అని వేసుకున్నాడు. తర్వాత దానికి ఆవిష్కరణోత్సవం ఏర్పాటుచేశాడు. జానపద సాహిత్యంపై ఇంత ఉద్గ్రంథాన్ని ఇదివరకెవరూ రచించలేదనీ ఇదివరకువచ్చిన వన్నీ చిన్నచిన్న పుస్తకాలేననీ, ఈసాహిత్యంలో ఇంత విశేషంగా పరిశోధన చేసినవారు లేరనీ పలువురు ప్రశంసించారు.

దీని తర్వాత హనుమంతరావుకు పురావస్తు పరిశోధనపైకి మనసు మళ్ళింది. వెంటనే పెళ్ళాంతో కలిసి పెరట్లో త్రవ్వకాలు సాగించాడు. గజంన్నరలోతు త్రవ్వేసరికి ఒక రాచ్చిప్పముక్క దొరికింది. ఇంకో గజం తవ్వేసరికి ఒక కొనదేలిన రాయి, పగిలిన పింగాణీ పళ్ళెం ముక్క దొరికాయి. పింగాణీ ముక్కపై పువ్వులున్నాయి. ఆ మూడు వస్తువులనీ గొయ్యిదగ్గర పక్కపక్కనపెట్టి ఫోటో తీయించాడు. "రాతియుగమునాటి కళాఖండములు" అని ఆ ఫోటోను "జయఢంకా"లోనూ సోదర పత్రికలలోనూ ప్రచురించాడు. వాటిమీద సుదీర్ఘమైన వ్యాసం రాశాడు. రాచిప్ప ముక్క రాతియుగంనాటి మానవుడు వాడిన వంటపాత్ర అనీ, రాయి క్రూరమృగములను వేటాడుటకు ఉపయోగించిన ఆయుధమనీ, పింగాణీముక్క ఆనాటి శిల్పకళా చాతుర్యానికి మచ్చుతునక అనీ వివరించాడు. హరప్పా, మొహంజదారులలో విలసిల్లిన మహోజ్వల నాగరికత ఈ ప్రాంతంలో కూడా విలసిల్లినదనడంలో ఏమాత్రం సందేహం లేదని తేల్చాడు. తన పరిశోధనా వ్యాసాన్నీ, ఫోటోను ఆంధ్ర ప్రభుత్వపు పురావస్తు పరిశోధనశాఖకు పంపించాడు. కళాఖండాలు బయల్పడిన రోజునే

(మిగతా 80వ పేజీలో)



పదెకరాల గనిగడ్డ కాసామి నరసింహం గారు ఆయన తన కొడుకులిద్దరినీ నెత్తిమీద పెట్టుకొని పెంచాడు. కోతితే కొండమీద కోతి నైనా తెచ్చేవాడు. కాని డబ్బులుగామాత్రం చిల్లుకానీకూడా ఎన్నడూ చేతికి దొరకనిచ్చే వాడుకాదు. ఆ విషయంలో ఆయనకు కొన్ని నిశ్చితాభిప్రాయా లున్నాయ్!

పిల్లలకు ముద్దుకోసం డబ్బు లిస్తాం. ముద్దు ముద్దుగా వాళ్ళు ఖర్చు కలవాటు పడతారు. నిమ్మతొనలూ, తిమ్మిరి బిళ్ళలూ మెల్లమెల్లగా బీడీలు సిగిరెట్లుగా మారతయ్! ఆ పయిన తాగుడూ, జూదమూ ... అలా ... అలా సవాలక్ష!

డబ్బు విలువ పూర్తిగా తెలిసిందాకా పిల్లలకు పైసాకూడా చేతికివ్వకూడదు తెలిసిం తర్వాత వాళ్ళే సంపాదించుకుంటారు, అట్లా పెంచటంవల్లనే తన పెద్ద కొడుకు వాసు పెద్ద ప్రయోజకు డయ్యాడంటాడు నరసింహారావు గారు, సగర్వంగా అప్పుడప్పుడూ, మారణశాస్త్రాలకు విరుగుడు కనిపెట్టిన మహా శాస్త్రజ్ఞుడిలా!

వాసుమాత్రం తక్కువ్వాడా? ఒక వైపున చదువుకుంటూనే చిన్న తరగతి పిల్లలకు ప్రయివేటు చెప్పేవాడు. తన ఖర్చులు పోను నెల నెలా యిరవయ్యో, పాతికో వెనకేసేవాడు. విన్న వాళ్ళెవరైనా ముక్కుమీద వేలు వేసుకోవలసిందే! పద్దెనిమిదేళ్ళు నిండకముందే ఒవర్సీరయ్యాడు. యిప్పుడు సూపవైజరయి యీ చేతా ఆ చేతా సంపాదిస్తున్నాడు.

నరసింహంగారు రెండో కొడుకు విష

---

(77వ పేజీ తరువాయి)

అతను పత్రికావిలేఖరుల గోష్టి ఏర్పాటుచేశాడు. విలేఖరులు వాటిని ముందుకూ వెనక్కూ తిప్పి వాసన చూసి నిశితంగా పరిశీలించి అవి రాతియుగంనాటివేవని తేల్చారు. పొరుగిళ్ళ అమ్మలక్కలూ, వూళ్ళో పెద్దలూకూడా వచ్చి వాటిని చూసి పోతున్నారు. ఒక బామ్మగారు "గాయత్రీదేవిని చాటుకు పిల్చుకు వెళ్ళి మీ ఆయన కేమైనా పిచ్చా ఏవిటమ్మా రాచ్చిప్పలు ఇప్పుడు మాత్రం మనం వాడుకోటంలేదూ పులుసు కాచుకనేందుకు? అయితే మనం రాతియుగంలో వున్నామా?" అది గాయత్రీదేవి సర్దిచెబుతూ "అదికాదులెండి బామ్మగారూ. అవి పైకి అలాగే కనిపిస్తాయి. ఆయనెంతో పరిశోధించి తెలుసుకున్నారు. చదువురాని మన ఆడవాళ్ళకేం తెలుస్తాయి. అటువంటి విషయాలు?" అన్నది. "ఏమిటోనమ్మా. అంతా చోద్యంగావుంది. విదపకాలం" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయింది బామ్మగారు.

విలేఖరుల పుణ్యమాఅని హనుమంతరావు పరిశోధన అన్నిపత్రికల్లోకి ఎక్కింది, జి. ధం. వి. సం వారు సమావేశమై ఈ కిరాతక కృత్యాన్ని గురించి చర్చించారు. హనుమంతరావును హత్యచేయడంతప్ప మరోమార్గం లేదని దృఢనిశ్చయానికి వచ్చారు. హత్య ఎవరు చేయాలి. ఎల్లాచెయ్యాలీ అన్న ప్రశ్న వచ్చింది. ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. కత్తితో చేయాలని ఒకరు, పిస్తోలుతో చేయాలని ఒకరు, విషం ఇవ్వాలని ఒకరు సలహా ఇచ్చారు. ఎల్లాచేసినా నేరం బయటపడే అవకాశం ఉందని అనుకున్నారు. అందుకని ఎవరైనా పాములవాణ్ణి మంచి చేసుకుని, లంచం ఇచ్చి, అతనిచేత ఒక పొగరుమోతు త్రాచుపామును హనుమంతరావు మీదకు ఉసిగొలిపించాలని అనుకున్నారు.

ఒకరోజు సాయంత్రం చీకటిపడే సమయంలో హనుమంతరావు చెరువుగట్టుమీద నుంచి వెళ్తుండగా కాపువేశారు. అదను చూసి పామును విడిచిపెట్టారు. అది సరాసరి వెళ్ళి తన బలంకొద్దీ హనుమంతరావు కాలుమీద కాటువేసింది. మరుక్షణంలో "హా చచ్చితిని. చచ్చితిని" అంటూ గిలగిల తన్నుకుని ప్రాణాలు వదిలింది పాము. హనుమంతరావు దానివంక చూసి వికటాట్టహాసం చేస్తూ మీసం తిప్పాడు.

(వచ్చే నెల 'స్వామీసారస్వతానంద')

★